క్లుప్తంగా

వృద్ధులతో గడపడం సంతోషదాయకం



భోజనం వడ్డిస్తున్న జిందాల్ ప్రతినిధులు

గూడూరురూరల్: పట్టణంలోని వృద్ధాశ్రమంలో వృద్ధులతో గడపడం ఎంతో సంతోషంగా ఉందని జిందాల్ పరిశ్రమ ప్రతినిధులు తెలిపారు. చిల్లకూరు మండలం తమ్మినపట్నంలోని సింహపురి ఎనర్జీ లిమిటెడ్, జిందాల్ చైర్‌పర్సన్ సావిత్రి జిందాల్ పుట్టిన రోజు సందర్భంగా వృద్ధులకు ఒక పూట భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృద్ధులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించే క్రమంలో వృద్ధులను కలుసుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. పరిశ్రమ సీఎస్‌ఆర్‌లో భాగంగా సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తున్నామని చెప్పారు. అనంతరం వృద్ధులకు భోజనం వడ్డించారు. కార్యక్రమంలో ప్లాంట్ హెడ్ సుల్తాన్ అహ్మద్ మన్సూరీ పాల్గొన్నారు.

తారు ప్లాంట్ ఎత్తేయాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న తుంగపాళెం వాసులు

గూడూరురూరల్: కాలుష్యానికి కారణమవుతున్న తారు ప్లాంట్‌ను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ గూడూరు మండలంలోని తుంగపాళెం గ్రామస్తులు శుక్రవారం ప్లాంట్ ఎదుట ఆందోళన చేశారు. తారు ప్లాంట్ కాలుష్యం కారణంగా స్థానిక ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ప్లాంట్ నుంచి దుమ్ము, ధూళి, పొగ వస్తున్న కారణంగా తాము పలు వ్యాధుల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీ కాలుష్యంతో నిమ్మ, ఇతర పంటలు దెబ్బతింటున్నాయని, దిగుబడి రాక నష్టపోతున్నామని రైతులు తెలిపారు. అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని, నిర్వాహకులతో కుమ్మక్కై తమను బెదిరిస్తున్నారని వాపోయారు.

వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

రాపూరు: మండలంలోని కండలేరు రోడ్డు వద్ద శుక్రవారం కండలేరు డ్యామ్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ అనూష వాహనాల తనిఖీ చేపట్టారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రభుత్వ నిబంధనలు పాటించాలని, మత్తుపదార్థాలు సేవించి వాహనాలు నడపకూడదని, సరైన పత్రాలు కలిగి ఉండాలన్నారు. అధిక లోడ్‌తో ప్రయాణం ప్రమాదకరమని చెప్పారు.

అంబలి, మజ్జిగ పంపిణీ



అంబలి పంపిణీ చేస్తున్న నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు

వాకాడు: తూర్పు కనుపూరు ముత్యాలమ్మ జాతర సందర్భంగా శుక్రవారం వాకాడు నాయీబ్రాహ్మణ సంఘం వారు స్థానిక అశోక్‌స్తంభం కూడలిలో భక్తులకు అంబలి, మజ్జిగ పంపిణీ చేశారు. ఆ సంఘం నాయకుడు నెలమల్లి సురేష్ జాతరకు వచ్చిన భక్తుల దాహం తీర్చే క్రమంలో రాగి అంబలి, మజ్జిగ ఉదయం నుంచి సాయంత్రం వరకు పంపిణీ చేశారు.

కొనసాగుతున్న రథయాత్ర



ప్రజలతో మాట్లాడుతున్న రవిరాఘవేంద్ర

రాపూరు: మండలంలోని బొజ్జనపల్లె, వీరాయిపాళెం, గిలకపాడులో శుక్రవారం ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ యునైట్ ఫోరం ఆధ్వర్యంలో చేపట్టిన బహుజనుల చైతన్య రథయాత్ర కొనసాగింది. ఫోరం జాతీయ అధ్యక్షుడు రవి రాఘవేంద్ర, ఉపాధ్యక్షుడు విజయకుమర్ మాట్లాడుతూ కాన్సీరాం జయంతి వేడుకల్లో భాగంగా గ్రామాల్లోని ప్రజలను కలుసుకుని ప్రజల సమస్యలు తెలుసుకోవడమే రథయాత్ర లక్ష్యమన్నారు. నాయకులు అరుణమ్మ, ప్రసాద్, కుమారి, కోటి, నాగరాజు పాల్గొన్నారు.

కండలేరులో 42.565 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 42.565 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగ కాలువకు 590 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 10, మొదటి బ్రాంచ్‌కెనాల్‌కు 60, లోలెవల్ స్లూయీస్‌కు 20, హైలెవల్ స్లూయీస్‌కు 140 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నామన్నారు.

చినుకు... వణుకు

- వర్షం రాకతో అన్నదాతల్లో ఆందోళన
- వరికోతలకు తీవ్ర ఆటంకం
- తడిస్తే ధాన్యం రంగుమారి ధరలు పతనమయ్యే అవకాశం



వెంకటగిరి మండలం కలపాడు సమీపంలో నూర్పిడికి సిద్ధంగా ఉన్న వరి పంట

వెంకటగిరి: బంగాళఖాతంలో ఉపరితల ఆవర్తనం కారణంగా వాతావరణంలో వచ్చిన ఆకస్మిక మార్పులు, మరో రెండురోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణశాఖ సూచనలతో వరి సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే వెంకటగిరి నియోజవర్గంలోని వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి, రాపూరు, సైదాపురం మండలాల్లో ముమ్మరంగా వరికోతలు జరుగుతున్నాయి. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో గురువారం రాత్రి నుంచి చిరుజల్లులు ప్రారంభమయ్యాయి. శుక్రవారం ఓ మోస్తరు వర్షం కురియడంతో వరికోతలు నిలిచిపోయాయి. భారీ వర్షాలు, వడగళ్లు వాన కురిస్తే పంటకు ఎక్కడ నష్టం వాటిల్లుతుందోనని రైతుల్లో దిగాలు చెందుతున్నారు. నియోజకవర్గంలో రబీ సీజన్‌లో 24 వేల హెక్టార్లలలో వరిసాగు చేశారు. ఈ ఏడాది గతంలో ఎన్నడూ లేని విధంగా పంట దిగుబడులు ఆశాజనకంగా ఉండడంతోపాటు సాగు చేసిన ఎన్‌ఎన్‌ఆర్‌లు, బీపీటీ 5204 వంటి రకాలకు ప్రభుత్వ కనీస మద్దతు ధర మించి వ్యాపారులు కొనుగోలు చేస్తుండడంతో అన్నదాతల్లో ఆనందం వ్యక్తమవుతున్న తరుణంలో ద్రోణి ప్రభావంతో మొదలైన వర్షాలు, వాతావరణశాఖ హెచ్చరికలతో రైతుల వెన్నులో వణుకు పుడుతుంది. వర్షాల కారణంగా వరికోత యంత్రాల కిరాయి ధరలు సైతం పెరగడంతోపాటు, వర్షాలకు పంట నేలవాలితే కోత సమయం రెట్టింపు అయి, అదనంగా ఆర్థికభారం పడుతుందని ఆందోళన చెందుతున్నారు. అంతేగాక ధాన్యం తడిసి రంగుమారితే ధాన్యం ధరలు తగ్గిపోతాయనే ఆవేదన రైతుల్లో వ్యక్తం అవుతోంది.

పర్వతరెడ్డి స్వగ్రామంలో సంబరాలు



సంబరాలు చేసుకుంటున్న వల్లిపేడు గ్రామస్తులు

చిల్లకూరు: తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి విజయం సాధించడంతో ఆయన స్వగ్రామమైన వల్లిపేడులో సంబరాలు జరుపుకున్నారు. మండలంలోని వల్లిపేడు గ్రామానికి చెందిన చంద్రశేఖరరెడ్డి అధ్యాపకుడిగా పని చేస్తూ నెల్లూరులో ప్రైవేటు కళాశాలను స్థాపించి, ఎంతోమందికి అండగా నిలిచారు. ఈ క్రమంలోనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక చేశారు. ఎన్నికల్లో ఆయన విజయం సాధించడంతో గ్రామంలో సంబరాలు జరుపుకున్నారు. అలాగే మజీద్‌లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ వల్లిపేడు గ్రామస్తుడైన చంద్రశేఖరరెడ్డి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందడం ఎంతో సంతోషంగా ఉందని అలాగే చంద్రశేఖరెడ్డిని సీఎం జగన్ ఎంపిక చేయడం ఆనందదాయకమని గ్రామస్తులు పేర్కొన్నారు.

విజయంపై హర్షం

నాయుడుపేట: ఉపాధ్యాయ ఎమ్మెల్సీలో విజయం సాధించారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ట్రేడ్ యూనియన్ నాయకులు కట్టా వెంకటరమణారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కట్టా తన నివాసంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. విద్యావంతులైన ఉపాధ్యాయులు పరిపాలనా సౌలభ్యం, పరిపాలనాదక్షత కలిగిన నాయకుడు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనని గుర్తించి ఓట్లు వేసి గెలిపించారని అభిప్రాయపడ్డారు.

పర్యవేక్షణ పెంచాలి



కొత్తపాళెంలో ప్రభుత్వ పథకాల అమలును పరిశీలిస్తున్న డీపీఓ

కోట: గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణతోపాటు వ్యర్థాల నుంచి సంపద సృష్టించుకునేలా పంచాయతీ అధికారులు పర్యవేక్షణ పెంచాలని డీపీఓ రాజశేఖర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని కొత్తపాళెంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని డీపీఓ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ తడి, పొడి చెత్తలను వేర్వేరుగా సేకరించి వర్మీకంపోస్టు ఎరువు తయారు చేసి, పంచాయతీలకు ఆదాయం వచ్చేందుకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలు అమలుపై అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీఓ వెంకటరమణ, ఎంపీడీఓ భవానీ, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ పాల్గొన్నారు.

జాతరలో పోలీస్ సేవలు భేష్

- నెల్లూరు జిల్లా ఎస్పీ విజయారావు



ఎస్పీ విజయారావుకు స్వాగతం పలుకుతున్న అర్చకులు

చిల్లకూరు: ముత్యాలమ్మ జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తిరుపతి జిల్లా పోలీసులు చేపట్టిన చర్యలు చాలా బాగున్నాయని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఎస్పీ విజయారావు అన్నారు. ముత్యాలమ్మ ఆలయంలో నాలుగు రోజులుగా జరుగుతున్న జాతరలో భాగంగా శుక్రవారం నెల్లూరు ఎస్పీ విజయారావు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆలయ అర్చకులు ఆశీర్వచనాలతో పాటు పట్టువస్త్రాలను బహుకరించారు. ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల భక్తులు లక్షలాదిగా విచ్చేసే జాతర విజయవంతం అయ్యిందన్నారు. ఆయన వెంట సీఎఫ్ఓ కోవూరు జనార్దనరెడ్డి, ఆలయ ఈఓ నవీన్‌కుమార్, గూడూరు రూరల్ సీఐ దశరథరామారావు, ఎస్ఐ గోపాల్ ఉన్నారు.

క్రీడాపోటీలతో మానసికోల్లాసం



బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్ తదితరులు

గూడూరు: ఉద్యోగరీత్యా ఒత్తిడితో జీవనం సాగించే వారికి క్రీడాపోటీలతో మానసికోల్లాసం కలుగుతుందని ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పీ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. పట్టణ సమీపంలోని ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అంతర కళాశాలలో పనిచేసే సిబ్బందికి ఆటల పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను కళాశాల వ్యాయామ అధ్యాపకుడు డాక్టర్ పీ నారాయణరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పోటీల్లో వీఎస్‌యూ పరిధిలోని 15 కళాశాలల సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ క్రీడా పోటీలను నిర్వహించారన్నారు. అనంతరం యూనివర్సిటీ క్రీడల బోర్డు సెక్రటరీ డాక్టర్ కే సునీత మాట్లాడుతూ అప్పుడప్పుడూ ఇలాంటి పోటీలను నిర్వహించడంతో స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుందన్నారు. నూతనోత్తేజం కూడా వస్తుందన్నారు. అనంతరం విజేతలకు ప్రశంసా పత్రాలతోపాటు బహుమతులు అందజేశారు.

సొసైటీలో బంగారుపై రుణ సౌకర్యం



గోల్డ్‌లోన్ సౌకర్యాన్ని ప్రారంభిస్తున్న డీసీసీబీ సీఈఓ శంకర్‌బాబు

కలువాయి: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(సొసైటీ)లో బంగారు తాకట్టుపై రుణాలు అందజేసే కార్యక్రమానికి శుక్రవారం శ్రీకారం చుట్టినట్లు నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సీఈఓ చల్లా శంకర్‌బాబు తెలిపారు. శుక్రవారం ఆయన ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రైతులు ఈ సేవలను ఇక ముందు కలువాయిలోనే పొందవచ్చన్నారు. ఒక గ్రాముకు రూ.3,900 వరకు రుణం ఇస్తామన్నారు. గరిష్ఠంగా రూ.10 లక్షల వరకు రుణాలు ఇస్తామన్నారు. సొసైటీ చైర్మన్ చల్లా సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ కలువాయిలో గోల్డ్ లోన్ సౌకర్యం కల్పించినందుకు సీఈఓ శంకర్‌బాబుకు ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యకార్యనిర్వహణాధికారి చలమల సుదర్శన్‌రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి



ర్యాలీ చేస్తున్న ఎంఎస్ఎఫ్ నాయకులు

వెంకటగిరి: కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్(ఎంఎస్ఎఫ్) నాయకులు మంగళపురి సురేష్ మాదిగ, పి వెంకటేశ్వర్లు, జి శ్రీనివాస్‌మాదిగ, మంద పెంచల య్య కోరారు. క్రాస్‌రోడ్డు కూడలి అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ చేశారు. ఆ యూనియన్ జిల్లా మహిళా కన్వీనర్ చల్ల మనీషా, నియోజకవర్గ కన్వీనర్ పల్లిపాటి రవిమాదిగ, నాయకులు ఎం విజయలక్ష్మి, కె మణి, పి పెంచలయ్య, కె వెంకటస్వామి, ఎల్ ఈశ్వరయ్య, ఏ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్నుకు వడ్డీ రాయితీ

సూళ్లూరుపేట: మున్సిపాలిటీలు, కార్పొరేషన్ పరిధిలో ఇంటి పన్నులు, ఖాళీ స్థలాలకు సంబంధించిన పన్ను బకాయిలున్న వారికి వడ్డీ లేకుండా చెల్లించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం జీఓ విడుదల చేసింది. ఈ నెలాఖరులోపు చెల్లించేలా రాయితీ ఇచ్చింది. సూళ్లూరుపేట పట్టణంలో కూడా ఇంటిపన్నులు, ఖాళీ స్థలాలకు సంబంధించిన పన్నులు చెల్లించని వారు బకాయిలున్న వారు వాటిని ఈ నెలాఖరులోపు ఎలాంటి వడ్డీలు చెల్లించకుండా కట్టుకునే వీలు కల్పించింది. బకాయిలున్న వారు వెంటనే చెల్లించుకోవాలని కమిషనర్ నరేంద్రకుమార్ తెలిపారు.

నాయుడుపేటటౌన్: మున్సిపాలిటీ పరిధిలో 2021–23 మార్చి నెల 31 వరకు చెల్లించాల్సిన ఇంటి పన్ను, ఖాళీ స్థలాలకు సంబంధించిన పన్నులకు ప్రభుత్వం వడ్డీ రాయితీ ప్రకటించినట్లు కమిషనర్ శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. పన్ను చెల్లింపు దారులు ప్రభుత్వం ప్రకటించిన వడ్డీ రాయితీతో పాత బకాయిలను ఒకేసారి చెల్లించి వడ్డీ మినహాయింపు పొందలన్నారు.

అపరాధ రుసుం మాఫీ

గూడూరు: పురపాలక సంఘంలోని ఆస్తి, ఖాళీ స్థలాలకు సంబంధించిన పన్నులను ఒకేసారి చెల్లిస్తే, అపరాధ రుసుం మాఫీ చేస్తామని మున్సిపల్ కమిషనర్ సాయినాథ్ శుక్రవారం తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఈ నెల 16వ తేదీన జారీ చేసిన ఉత్తర్వుల మేరకు ఇప్పటివరకు ఉన్న పన్ను బకాయిల ను 2022–23 రెండో అర్ధ సంవత్సరం వరకూ పూర్తిగా ఒకేసారి చెల్లించాలన్నారు. ఈ అవకాశం ఈ నెల 31వ తేదీ లోపు చెల్లించినవారికే వర్తిస్తుందన్నారు.

వెంకటగిరి: మున్సిపాలిటీలో పన్నుల పాత బకాయిలు పూర్తిగా చెల్లించేవారికి ఎటువంటి అపరాధ రుసుం లేకుండా చెల్లించే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని మున్సిపల్ కమిషనర్ బీవీ రామయ్య తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మున్సిపాలిటీకి పన్నులు బకాయిలు ఉన్న వారు ఈ నెల 31వ తేదీలోగా చెల్లించేవారికే అపరాధరుసుం(వడ్డీ) లేకుండా చెల్లించే వెసులుబాటును ప్రభుత్వం కల్పించిందన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం నేడు

వెంకటగిరి: పట్టణంలోని పాలకేంద్రం సెంటర్ 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం మధ్యాహ్నం 2.00 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకూ వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లె మండలాల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వెంకటగిరి ట్రాన్స్‌కో డీఈఈ మునిరవిచంద్ర శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు , రైతులు సహకరించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన లింగయ్య

చిల్లకూరు: మండలంలోని మన్నేగుంట సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు కథనం మేరకు.. మన్నేరిగుంట గ్రామానికి చెందిన ఇరగరాజు లింగయ్య అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై కొమరావారిపాళెం వైపు వెళుతుండగా మార్గం మధ్యలో ఉన్న కల్వర్టు వద్ద వాహనం అదుపు తప్పి పైనుంచి కాలువలో పడి పోయాడు. దీంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేశారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అతనిని మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. ఈ విషయంపై పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదన్నారు.

మహిళపై దాడి

సూళ్లూరుపేట: ఓ మహిళపై ఇద్దరు మహిళలు దాడి చేసి గాయపరిచిన సంఘటన సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలోని వట్రపాళెంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. వట్రపాళెంలోని ఆళ్లకుంట వరలక్ష్మి (35) ఇంటి ఆవరణలో గడ్డి ఏపుగా పెరిగిపోవడంతో విషపురుగులు చేరుతున్నాయని, పిల్లలున్న నేపథ్యంలో వారికి అపాయం కలగకుండా ఆ గడ్డి నిర్మూలనకు కలుపు నివారణ మందు కొట్టారు. దీంతో పక్కనే ఉన్న వాణి, వనితలకు చెందిన ఇంటి ఆవరణలో వున్న జామ చెట్టు ఎండిపోయిందనే నెపంతో శుక్రవారం వంట చేసుకుంటున్న వరలక్ష్మిపై ఆకారణంగా దాడి చేశారు. ఆ సమయంలో ఆమె భర్త ఇంట్లో లేకపోవడంతో ఆమె పారిపోయి, పక్కింట్లో దాక్కుని ఫోన్ చేసి సమాచారం అందించింది. దీంతో ఆయన శరవేంగా వచ్చి 100 ఫోన్ చేసి సమాచారం అందించారు. వెంటనే పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని, గాయపడిన వరలక్ష్మిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వనిత, వాణిపై కేసు నమోదు చేశారు. నిందితులను విచారిస్తున్నారు.

సైదాపురంలో అకాల వర్షం



సైదాపురం: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం అకాల వర్షం కురిసింది. కొద్ది రోజులుగా ఎండలు తీవ్రంగా కాస్తుండటంతో ప్రజలు తట్టుకోలేక ఇబ్బందులు పడ్డారు. ఈ వర్షంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. వరి సాగు చేసే రైతులకు స్వల్ప నష్టం వాటిల్లింది. ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడింది.

ముఖ్యమంత్రిని కలసిన మునమాల



తాడేపల్లెలోని సీఎం కార్యాలయంలో గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలసిన కలువాయికి చెందిన మునమాల అజయ్ రెడ్డి

జనరంజక బడ్జెట్

సూళ్లూరుపేట: ఏపీ ఆర్థికశాఖామాత్యులు బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రవేశపెట్టిన బడ్జెట్ జనరంజకంగా ఉందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. ఆయన అమరావతి నుంచి ఫోన్ చేసి బడ్జెట్‌పై మాట్లాడారు. రూ.2,79,279 కోట్లతో ఏపీ వార్షిక బడ్జెట్ అన్ని వర్గాల సంక్షేమంతో పాటు రాష్ట్ర సమగ్రాభివృద్ధే లక్ష్యంగా చేసుకుని అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ గతంలో ఎన్నడూ లేని విధంగా ఉందని చెప్పారు. ఇందులో ముఖ్యంగా వైఎస్సార్ పింఛన్ కానుకకు రూ.21,434.72 కోట్లు, వైఎస్సార్ రైతు భరోసాకు రూ.4,020 కోట్లు, జగనన్న విద్యాదీవెనకు రూ.2,841 కోట్లు కేటాయించి రాష్ట్రంలో వృద్ధులు, వితంతవులు, దివ్యాంగులకు చేయూత ఇచ్చేలా ఉందన్నారు. వ్యవసాయం, విద్యకు సమ ప్రాధాన్యతనిచ్చిన ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోయారన్నారు. దీన్ని చూసి టీడీపీ నాయకులు ఓర్వలేక సభా సమయాన్ని వృథా చేయడం, బడ్జెట్ చదువుతుంటే అడ్డదిడ్డంగా అరుపులు కేకలతో గందరగోళ పరిస్థితులను సృష్టిస్తున్నారని ఆరోపించారు. టీడీపీ వారి తీరు అమ్మా పెట్టనీయదు.. అడుక్కుని తిననీయదనే చందంగా ఉందన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఏ పేదవాడ్ని ఆదుకున్నారో చెప్పాలని నిలదీశారు.

కల్యాణం.. కమనీయం



కల్యాణోత్సవం చేస్తున్న వేదపండితులు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని చంద్రబాబు కాలనీలో ఉన్న కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామివారి కల్యాణోత్సవం కనులపండువగా నిర్వహించారు. స్వామి అమ్మవార్లకు విశేషాలంకరణ చేసి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారి కల్యాణోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కామిరెడ్డి రాజారెడ్డి, భారతి, రాజేష్, లౌక్య దంపతులు తదితరులు సారథ్యంలో కల్యాణోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం వందలాది మంది భక్తులకు అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి, నాయకులు ఒట్టూరు కిషోర్ యాదవ్, కరీంబాయి, చెంచయ్య, వైస్ చైర్మన్ వెంకటకృష్ణారెడ్డి, బైనా మల్లికార్జున రెడ్డి, పాపాడి చంద్రారెడ్డి, కనమర్లపూడి సుబ్రమణి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి పురస్కారం

గూడూరురూరల్: మండలంలోని నెర్నూరు ప్రాథమికోన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు, రచయిత కొండూరు వెంకటేశ్వరరాజుకు అంతర్జాతీయ కీర్తి పురస్కారం లభించింది. వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన(ఐఎస్ఓ గుర్తింపు కలిగిన) మనం ఫౌండేషన్ సేవా సంస్థ వారు ఈ అవార్డును ప్రదానం చేసినట్లు వెంకటేశ్వరరాజు తెలిపారు. రెండు దశాబ్దాలుగా విద్య, సాహిత్య, కళా రంగాల్లో వెంకటేశ్వరరాజు చేస్తున్న స్ఫూర్తిదాయక సేవలను ప్రశంసిస్తూ మనం ఫౌండేషన్ చైర్మన్ కె.చక్రవర్తి ఈ అవార్డుకు సంబంధించిన ధ్రువపత్రాన్ని శుక్రవారం ఆన్‌లైన్ ద్వారా అందజేశారు.

ముత్యాలమ్మకు రూ 41.31 లక్షల ఆదాయం



హుండీ కానుకలను లెక్కిస్తున్న బ్యాంకు సిబ్బంది

చిల్లకూరు: తూర్పుకనుపూరులోని ముత్యాలమ్మ ఆలయంలో నాలుగు రోజులగా జరుగుతున్న జాతరలో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా రూ 41,31,092 లక్షలు వచ్చినట్లు దేవదాయశాఖాధికారులు తెలిపారు. ముత్యాలమ్మ ఆలయంలో శుక్రవారం దేవదాయశాఖాధికారులు, బ్యాంకు అధికారుల సమక్షంలో జాతరలో భక్తులు అమ్మవారికి సమర్పించిన కానుకలు, టికెట్ల రూపంలో వచ్చిన ఆదాయం లెక్కించారు. ఈ సందర్భంగా సీఎఫ్ఓ కోవూరు జనార్దనరెడ్డి, ఆలయ ఈఓ నవీన్‌కుమార్ మాట్లాడుతూ కోవిడ్ తరువాత ఇప్పుడిప్పుడే భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు వస్తున్న క్రమంలో నాలుగు రోజులుగా నిర్వహించిన ముత్యాలమ్మ జాతరలో వివిధ రకాల టికెట్ల విక్రయంతో రూ.11,32,360 రాగా హుండీల ద్వారా రూ.29,98,732 వచ్చిందన్నారు. దీంతో మొత్తంగా రూ.41,31,092 ఆదాయం వచ్చిందన్నారు.

దున్నల వేలంతో రూ.13.30 లక్షలు..

ముత్యాలమ్మ ఆలయంలో జరిగే జాతరలో భక్తులు అమ్మవారికి సమర్పించిన దున్న పోతులను వ్యవసాయ పనుల నిమిత్తం వేలం పాటల ద్వారా విక్రయించగా రూ.13.30 లక్షలు ఆదాయం వచ్చినట్లు శుక్రవారం ఆలయ ఈఓ నవీన్‌కుమార్ తెలిపారు. తూర్పుకనుపూరులోని పోలేరమ్మ ఆలయం వద్ద భక్తులు అమ్మవారికి సమర్పించిన దున్న పోతుల విక్రయానికి బహిరంగ వేలం నిర్వహించారు. ఈ వేలం పాటల్లో పది మంది పాటదారులు ధరావత్తు కట్టి పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో దేవాదాయ ఇన్‌స్పెక్టర్ శ్రీలత, మాజీ చైర్మన్ సింహాద్రి మనోహర్, ఆలయ మాజీ ట్రస్టీ దువ్వూరు చంద్రారెడ్డి, వీఆర్వో రామచంద్రయ్య పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి



డక్కిలి: మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

డక్కిలి: విద్యలో వెనుకబడిని విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేకదృష్టి సారించాలని ఎంఈఓ కే వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని నడింపల్లె ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఎంఈఓ మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ ప్రభుత్వ పాఠశాలలో చదివేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు హాజరు, ఇటీవల జరిగిన పరీక్షలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన మెనూను సక్రమంగా అమలు చేయాలని సూచించారు. ఆయన వెంట హెచ్‌యం ఓ వేణుగోపాల్ ఉన్నారు.

సారా తయారీ స్థావరంపై దాడులు



నిందితుడితో ఎస్ఈబీ అధికారులు

డక్కిలి: మండలంలోని డీ వడ్డిపల్లె సమీపంలోని వెలుగొండలు కొండలు కింద దేవులపల్లె రైల్వే సొరంగ మార్గం(టన్నెల్) సమీపంలో సారా స్థావరాలపై పోలీసులు శుక్రవారం దాడులు చేశారు. వెంకటగిరి ఎస్ఈబీ సీఐ నాగేశ్వరరావు కథనం మేరకు.. డీ వడ్డిపల్లె గ్రామానికి చెందిన మోకాళ్ల నరసింహులు, బండి బాలకృష్ణ గ్రామానికి ఎగువ ప్రాంతంలో వెలుగొండలు కింద సారా తయారీకి 200 లీటర్ల బెల్లం ఊటను సిద్ధం చేసినట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎస్ఈబీ పోలీసులు ఆ ప్రాంతంలో దాడులు చేసి, బెల్లం ఊటను ధ్వంసం చేశారు. బాలకృష్ణ అనే వ్యక్తి పరారు కాగా నరసింహులను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచినట్ల సీఐ తెలిపారు. ఈదాడుల్లో హెడ్ కానిస్టేబుల్ జే మునిశేఖర్, కానిస్టేబుళ్ల ఎస్‌కే రఫీ, బీ పుట్టయ్య పాల్గొన్నారు.